క్లుప్తంగా

సీతల సప్తమి వేడుకలు



డోర్నకల్ : స్థానిక ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం మార్వాడీ మహిళలు సీతల సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మతల్లి ఆలయంలో సీత్లా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యోదయానికి ముందు పూజలు నిర్వహించిన అనంతరం చల్లని ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నారు. రాజస్థాని సాంప్రదాయంలో పూజలు నిర్వహించారు.

ప్రాణం తీసిన 'కరెంట్ వేట'

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నర్సింహులపేట : మండలంలోని కొమ్ములవంచకు చెందిన పార్నంది మోహన్ (33) గ్రామ శివారులోని ఆకేరు వాగులో కరెంట్ వైర్లతో చేపలు పట్టేందుకు వెళ్లి వైర్లు రిపేరు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందాడు. వాగులో చేపల వేటకు వెళ్లి వైర్లు వేశాడు. వైర్లు రిపేరు చేస్తుండగా అవి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోత్ సురేష్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

దంతాలపల్లి : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో దాట్లలో చోటు చేసుకుంది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన చిర్ర శ్రీను రోజువారి వృత్తిలో భాగంగా శుక్రవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడగా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని వేమునూరు గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నారు. డ్రైవర్ గుగులోత్ ప్రవీణ్, యజమాని గుగులోత్ మురళిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక తెలిపారు.

మొక్కజొన్న కంకులు దగ్ధం

బయ్యారం : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మొక్కజొన్న కంకులు దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలోని కోయగూడెం సమీపంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టి.అరవింద్ తన చేనులో మొక్కజొన్న కంకులను కుప్పలుగా పోశాడు. ఆకస్మాత్తుగా చొప్పకు అంటుకున్న నిప్పు కంకుల వరకు వ్యాపించడంతో అవి కాలిపోయాయి. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న మహబూబాబాద్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి



కొత్తగూడ : బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న దాడులను ఎదుర్కొవాలంటే బాలికల్లో ఆత్మ స్థైర్యం పెరగాలన్నారు. ఆపదలో డయల్-100, షీ టీంకు కాల్ చేయాలని అన్నారు. ఎస్సై కుశకుమార్, ప్రిన్సిపాల్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని పునరుద్ధరించండి!

- గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన
- మహబూబాబాద్–ఖమ్మం మధ్య నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బాల్నిధర్మారం ఆకేరు వాగుపై కొట్టుకుపోయిన బ్రిడ్జి

మరిపెడ రూరల్ : రెండు జిల్లాల మధ్య బంధాలు కొనసాగడంతో పాటు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుందని 2017లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం-మానుకోట రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్నిధర్మారం శివారు ఆకేరు వాగుపై రూ.16 కోట్లు వెచ్చించి ఆధునిక టెక్నాలజీతో బ్రిడ్జిని అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నిర్మించారు. ఈ బ్రిడ్జిపై ఏడేళ్లుగా రెండు జిల్లాల మధ్య అన్ని రకాల వాహనాలు రాకపోకలు కొనసాగాయి.

2024 కొట్టుకుపోయిన బ్రిడ్జి..

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఆకేరు వాగు ఎగువ ప్రాంతంలోని గ్రామాల్లో అనేక గొలుసు కట్టు చెరువులు తెగిపోయాయి. ఆయా చెరువుల నీరంతా ఆకేరు వాగులోకి చేరుకోగానే వాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలోనే బాల్నిధర్మారం శివారు ఆకేరు వాగు బ్రిడ్జి ఆనవాలు లేకుండా అర కిలోమీటర్ మేర కొట్టుకుని పోయింది. కేవలం వాగులో బ్రిడ్జి పిల్లర్లు మాత్రమే ఓ వైపు ఒరిగిపోయి మిగిలాయి. అప్పటి నుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ప్రజలు ప్రయాణించడం ఇబ్బందిగా మారింది.

ఆరు నెలలుగా రాకపోకలు బంద్..

సరిహద్దు జిల్లాల మధ్య ఉన్న ఆకేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగించారు. ఇక్కడి నుంచి ఖమ్మం జిల్లా, అక్కడి ప్రజలు మహబూబాబాద్ జిల్లాకు నిత్యం వేలాదిగా ప్రయాణం కొనసాగిస్తుండే వారు. వాగు పరివాహక ప్రాంత గ్రామాల వారు బ్రిడ్జితో తమ కష్టాలు తీరాయనుకున్నారు. కానీ బ్రిడ్జి తెగిపోవడంతో మళ్లీ మొదటికే కష్టాలు వచ్చాయి. జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయి వ్యవసాయ మార్కెట్‌కు రైతులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు ఖమ్మం-మహబూబాబాద్ రెండు జిల్లాల మధ్య రాకపోకలతో పాటు ప్రజల సత్సంబంధాలు కొనసాగేలా ఆకేరు వాగుపై కొట్టుకునిపోయిన బ్రిడ్జిని పునరుద్ధరించాలని ఆయా జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

> **ఇబ్బందులు పడుతున్నాం..**
>
> 
>
> రెండు జిల్లాల సరిహద్దులోని ఆకేరు వాగుపై కొట్టుకొనిపోయిన బ్రిడ్జిని మళ్లీ నిర్మించాలి. పనుల నిమిత్తం బాల్నిధర్మారం గ్రామానికి ఐదు కిలో మీటర్ల మేర ఏటిలో నుంచి నడిచి రావాల్సి వస్తోంది. రాక పోకలు నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
>
> – గుగులోత్ కాలు నాయక్, రాయిచెట్టుతండా, ఖమ్మం జిల్లా

'ఆర్థిక స్వావలంబన సాధించాలి'



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్ : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రూరల్ సీఐ పి.సర్వయ్య పేర్కొన్నారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సర్వయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. కుట్టు మిషన్ శిక్షణ ద్వారా ఆర్థికంగా వృద్ధి చెందడమే కాకుండా కుటుంబానికి ఆసరాగా నిలిచి ఆత్మగౌరవంతో బతుకు తారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దేవరం ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ అంతా యువతదే అని, గ్రామాభివృద్ధికి యువత పాటుపడుతూ తమ చిత్తశుద్ధిని చాటుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపిక, గుండెల రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై పోరాటం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

నెహ్రూసెంటర్ : దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా యువతరం పోరాటాలు చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాల రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కవ్వాత్తుల ర్యాలీ, ప్రదర్శనలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ఇచ్చిన స్ఫూర్తితో యువతరం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తుడుం వీరభద్రం, బట్టు చైతన్య, సిహెచ్ గణేష్, గుడిబోయిన రమేష్, ప్రభాకర్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ చట్టం చేయాలి

భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టాన్ని చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జలగం ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతుందని, ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫమయ్యాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మేక వెంకటేష్, శ్రీనాథ్, చిలువేరు వికాస్, జూలకంటి వేణు, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

గార్ల : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీవేజ్, కాంటిజెంట్, పార్ట్‌టైం వర్కర్స్‌గా 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ డైలీవేజ్ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆకుల రాజు, కార్మికులు బి వీరన్న, నరసింహరావు, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



గూడూరు : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టి వెంకన్న ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు హర్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, బుడిగె సతీష్‌గౌడ్, అర్రెం వీరస్వామి, రాసమల్ల యాకయ్య, పూజారి శంకర్‌గౌడ్, ఎలమందల శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్‌గౌడ్, మంగీలాల్, బాలూనాయక్ పాల్గొన్నారు.

పాలాభిషేకం

మహబూబాబాద్ రూరల్ : ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం బిల్లు అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య మాట్లాడారు. ఎన్నికలకు హామీ ప్రకారం అసెంబ్లీలో బిల్లు ఆమోదం అయ్యేలా చేశారని హర్షం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం : మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం బయ్యారంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ విజయలక్ష్మి, నాయకులు ప్రవీణ్‌నాయక్, వెంకట్రామయ్య, రాంమూర్తి, రాంబాబు, సురేష్, పుల్లయ్య, రవి, సతీష్, బాలరాజు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కురవి : మండలంలోని నారాయణపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్, నాయకులు బానోత్ రమేశ్, భద్రు నాయక్, గోపా నాయక్, వల్మా నాయక్, దీప్లా, తాన్సింగ్, మోతీలాల్, తేజావత్ రవి, మల్సూర్, భూక్య వెంకన్న, రవి, గాదె సాయికుమార్ పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కేంద్రం నిధులు



మాట్లాడుతున్న సురేందర్

గూడూరు : మండలంలోని 39 గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి పీఎం నరేంద్రమోదీ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం మండలాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ఈజీఎస్ నిధులు మంజూరు చేస్తుంటే మండల కాంగ్రెస్ నాయకులు ఆ రోడ్ల అభివృద్ధిలో శంకుస్థాపనలు చేయడానికి పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పైసా ఖర్చు చేయకపోగా, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ కట్టుబడి ఉందని, కానీ బీసీలకు అన్యాయం జరిగే కుట్రలు చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు గుండెబోయిన మల్లేష్‌యాదవ్, శ్రీశైలం, బత్తుల లక్ష్మణ్‌యాదవ్, కోరె అనిల్‌యాదవ్, పాండవుల మల్లయ్య, రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

రామాలయంలో బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్ : సీతారామచంద్ర స్వామి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివార్ల సప్తమ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వైఖానస ఆగమోక్తంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, ధ్రువ ఉత్సవమూర్తులకు పంచామృత, పలరస, అభిషేకం పూజలు జరిపారు.

నేడు గరుడ పూజ, ధ్వజారోహణం..

సీతారామచంద్ర స్వామివారి, వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం విష్వక్సేన పూజ, అగ్నిప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. సాయంత్రం నిత్యహోమం, పుణ్యాహవాచనం, బలిహరణ పూజలు, రాత్రి 7.30 గంటలకు సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముస్తాబైన కల్యాణ మండపం

జిల్లా కేంద్రంలోని వేణుగోపాల స్వామివారి దేవాలయం ఎదుట ఉన్న వైకుంఠవాసుడి కల్యాణ మండపం శోభాయమానంగా దర్శనమిస్తోంది. శ్రీకృష్ణ దేవరాయుల పరిపాలన సమయంలో మానుకోటలో వేణుగోపాల స్వామివారి దేవాలయం ఎదుట స్వామివారు, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన కల్యాణ మండపానికి ఉగాది, శ్రీరామ నవమి వేడుకల నిర్వహణలో భాగంగా భక్తులు, దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా రంగులు వేసి ముస్తాబు చేశారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు

దంతాలపల్లి : ఉపాధి హామీ కూలీలకు తగిన వసతులు కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న పేర్కొన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలు పనిచేసే ప్రాంతంతో తాగునీరు, వైద్యం, నీడ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దంతాలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి చిర్ర యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సంరక్షణపై సదస్సు

కురవి : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (శనివారం) ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ గ్రౌండ్ వాటర్ అధికారి వేముల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సదస్సు హాజరుకావాలని తెలిపారు.

రేపు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నిక

డోర్నకల్ : జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 23న డోర్నకల్‌లో జరుగనుందని వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా మాజీ సెక్రటరీ సుధాకర్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ ఆధ్వర్యంలో స్థానిక సంఘ్ యూనియన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగనుందని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దంతాలపల్లి : మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం 14 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్, మండల ప్రత్యేకాధికారి వీరన్న, ఆర్‌ఐ నజీముద్దీన్, దీక్షిత్, ఉదయ్‌కిరణ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

గార్ల : మండల కేంద్రానికి చెందిన గుగులోత్ నాగేశ్వరరావుకు ఇటీవల ప్రమాదం జరగడంతో కాలు విరిగింది. దీంతో శుక్రవారం గార్ల పోస్టాఫీస్‌లో ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.60,000ల యాక్సిడెంట్ చెక్కును ఖమ్మం పోస్టల్ అధికారి కాళీ మహేశ్వరీ బాధితుడికి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



డోర్నకల్ : వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ సీఈ (ఆపరేషన్స్) రాజు చౌహాన్ పేర్కొన్నారు. మండలంలోని తొడేళ్లగూడెం, ముల్కలపల్లి ఫీడర్లకు శుక్రవారం విడివిడిగా ఫీడర్లు అమర్చారు. ముల్కలపల్లిలో నూతనంగా అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ జనగామ నరేష్, డీఈ విజయ్‌కుమార్, ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత వేలం

గూడూరు : ప్రతీ బుధవారం జరిగే వారాంతపు సంత వేలం పాటను మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ కనకదుర్గ హాజరై పీసా చట్టం ప్రకారం జరగాల్సిన గ్రామసభ నిబంధనలు తెలిపారు. అనంతరం వారాంతపు సంత వేలాన్ని వాంకుడోత్ సోమన్న రూ.17,10,000లకు దక్కించుకున్నారు. ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అశోక్, ముక్తవరం సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతతోనే సమాజంలో మార్పు

పెద్దవంగర : సమాజంలో మార్పు రావాలంటే యువతతోనే సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల యూత్ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల యూత్ అధ్యక్షుడు బీసు హరికృష్ణ, నాయకులు ఆవుల మహేష్, సంతోష్, శ్రీనాథ్, వినోద్, రాంచరణ్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

డోర్నకల్ : మండలంలోని హూన్యా తండాలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేశారు. ఇటీవల పశువులు లంపీస్కిన్ బారిన పడుతుండటంతో పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో టీకాలు వేశారు. సుమారు 180 పశువులకు టీకాలు వేసినట్లు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. నేడు (శనివారం) బోడ హట్యాండాలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రయ్య, సులేమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

దంతాలపల్లి : మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో గురువారం అన్య మతస్తులపై దురుసుగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్య మతస్తులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీరిశెట్టిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న అన్యమతస్తులను అడ్డుకోని వారి చేతిలోని కరపత్రాలను మంటల్లో దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నెల్లికుదురు : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో హైదరాబాద్‌కు శుక్రవారం తరలి వెళ్తున్న కారిక్మకులను, ముదిరాజ్‌లను ప్రభుత్వం పోలీసులతో ముందస్తుగా అరెస్టు చేయించడం దారుణమని తెలిపారు.

గార్ల: బాలికోన్నత పాఠశాల వద్ద ఎస్సై, పోలీసులు



పెద్దవంగర: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



కురవి: పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న పోలీసులు



'పది' వార్షిక పరీక్షలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు పలు పాఠశాలల్లో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్క్వాడ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తును నిర్వహించగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ సిబ్బంది మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు.



కురవి: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న బాలికలకు పరిశీలిస్తున్న ఇన్విజిలేటర్లు



దంతాలపల్లి: పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్



డోర్నకల్: జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో విద్యార్థులు



చిన్నగూడూరు: పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



బయ్యారం: పరీక్షకు హాజరైన విద్యార్థులు

'హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి'



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కురవి : హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెంటనే నిలిపి వేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్ అన్నారు. శుక్రవారం కురవి గుడి సెంటర్ వద్ద భూముల వేలం నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్శిటీ వీసీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణేష్, మురళి, భరత్, వాసవి, వైష్ణవి, సిద్దు, సంపత్, వరుణ్, పూజేష్ పాల్గొన్నారు.